

హెల్త్‌క్యాంపులో పాల్గొన్న రాచకొండ పోలీస్‌కమిషనర్ సుధీర్‌బాబు

పోలీసుల ఆరోగ్యం కోసమే హెల్త్ క్యాంపులు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అంబర్‌పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉంటారని, వారి ఆరోగ్యాన్ని కాపాడటం కోసమే హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అంబర్‌పేట సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం పోలీసుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెల్త్ క్యాంపుల ద్వారా పోలీసులు తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఇకపై నెలకోసారి పోలీసుల ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో భువనగిరి జోన్ పరిధిలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధురంగా రఫీ గీతాల ఆలాపన



శైలేంద్రరెడ్డిని అవార్డ్‌తో సత్కరిస్తున్న నిర్వాహకులు పుల్లారావు, శ్రీనివాసులు

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అలనాటి రఫీ మధురగీతాలను గాయనీగాయకులు మధురంగా ఆలపించారు. రాగ మాధురి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా త్యాగరాయగానసభలో శుక్రవారం ప్రముఖ బాలీవుడ్ గాయకుడు మహ్మద్ రఫీపై ప్రత్యేక గీతాలాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హృదయాన్ని హత్తుకునేలా రఫీ పాడిన మంచిపాటలను ఎంపిక చేసుకుని పాడి శ్రోతలను మైమరపించారు. సంస్థ స్థాపక అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు ఏవీ పుల్లారావుతోపాటు కామేష్, గోపి, రవి, శ్రీనివాస్, హిమజ, స్వప్న, జ్యోతి, సావిత్రి గీతాలను ఆలపించారు. ఈసందర్భంగా ప్రముఖ గాయకులు శైలేంద్ర రెడ్డిని రాగమాధురి- మహ్మద్‌రఫీ అవార్డ్‌తో ఘనంగా సత్కరించారు. జాన్, చలపతి, సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

7న కవితావిక కవితాసంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత తిరుమల వెంకటస్వామి(టీవీ స్వామి) రచించిన కవితావిక కవితాసంపుటి ఆవిష్కరణ, అంకితోత్సవం కార్యక్రమం ఈనెల 7న త్యాగరాయగానసభలో జరుగుతుందని మానస ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి, ప్రముఖకవి రఘుశ్రీ తెలిపారు. ప్రముఖ చలనచిత్ర దర్శకులు రేలంగి నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ భైస దేవదాస్ అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం(కుప్పం) పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ఆవిష్కృత పుస్తకాన్ని అంకితం తీసుకుంటారని తెలిపారు.

13న దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన

కవాడిగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న ఎల్‌బీస్టేడియంలో నిర్వహించే దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ, చలో ఎల్‌బీస్టేడియం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్‌డీ సాయికృష్ణ, జి.రాజశేఖర్‌గౌడ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు జి.నాగేష్, కె.కుమారస్వామి, సన్నీడెల్, నర్సింహ, సురేష్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ముషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాలలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి శనివారం కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ సర్కిల్- 6ఏఎస్‌వో దీప్తి శుక్రవారం తెలిపారు. అంబర్‌పేటలోని రాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు, ముషీరాబాద్‌లోని కషీష్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు.

బీజేపీ ధర్నాను విజయవంతం చేయాలి

ముషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ధర్నాకు బీసీ కులసంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థిసంఘాలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర నగర నాయకులు హాజరవుతారని తెలిపారు.

నరేంద్రనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని నరేంద్రనగర్‌లో సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని నరేంద్రనగర్, చెన్నారెడ్డినగర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి, బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నరేంద్రనగర్‌లో శిథిలావస్థకు చేరిన మ్యాన్ హోల్స్ స్థానంలో నూతన మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సీసీ రోడ్డునిర్మాణ పనులకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. చెన్నారెడ్డి నగర్‌లో నిర్మాణంలో ఉన్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు ప్రదీప్ కుమార్, శ్రీగంధ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోమాత వైశిష్ట్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గోమాత వైశిష్ట్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని వక్తలు పేర్కొన్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ రచయిత, సినీనిర్మాత, దర్శకుడు లక్ష్మణరేఖ(నిట్టల గోపాలకృష్ణ) రచించిన శ్రీమాతే గోమాత పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రాత్రి నగయుగ గ్రూప్(తిరుపతి) ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ గోమాతను పూజిస్తేనే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డా. టి.గౌరీశంకర్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, రచయిత్రి లలితావాణి, డా.వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసశర్మ, సత్యనారాయణ, వండర్ బుక్ రికార్డ్స్ ఇండియా కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ, డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తదితరులు

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాన్‌సూన్‌లో భాగంగా అంబర్‌పేట సర్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నివారణ, డెంగీపై అవగాహన ర్యాలీని బసంత్‌కాలనీ, బర్కత్‌పురలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అడిషనల్ కమిషనర్ పంకజ, జోనల్ కమిషనర్ రవికిరణ్, అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రం వైఖరి వెల్లడించాలి

● టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సయ్య తదితరులు

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడానికి రాష్ట్రాల్లో కొన్ని శక్తులు కుట్రలుచేస్తున్నాయని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఐక్యతతో పనిచేయాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు- కేంద్ర ప్రభుత్వ వైఖరి అనే అంశంపై తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో త్వరలో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి బీసీ వర్గాలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జన సమితి నగర ప్రధానకార్యదర్శి బట్టల రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్జల్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ ఇస్మాయిల్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, బీసీ జన సమితి అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, నగర కోశాధికారి సురేష్‌కుమార్, కో-ఆర్డినేటర్ రవికాంత్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి హనుమంతుగౌడ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెబోయిన రవీందర్‌యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరు సుధాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లే కాంగ్రెస్ లక్ష్యం

నల్లకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల పై కాంగ్రెస్ ప్రభుత్వం ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడంతోపాటు ఆర్డినెన్స్ తీసుకురావడం జరిగిందన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ, పదేళ్ల పాలనలో టీఆర్ఎస్‌లు బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవపట్టించడానికి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ హలో బీసీ, చలో ఢిల్లీ పేరిట పోరాటం చేస్తుందన్నారు. ఈనెల 5న ప్రస్తుత పార్లమెంట్‌లో బిల్లు ఆమోదంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి, 6న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం, 7వ తేదీన రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించడం వంటి కార్యక్రమాలతో కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందన్నారు. ఈ మేరకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దఎత్తున బీసీలు తరలిరావాలన్నారు.



బాగ్‌లింగంపల్లిలో మట్టికుప్పలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి, డీఎంసీ రామానుజులరెడ్డి

రోడ్లపై మట్టికుప్పలు, చెత్తను తరలించాలి

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని పలుచోట్ల పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డితో కలిసి ఆయన బాగ్‌లింగంపల్లిలో పర్యటించారు. మట్టికుప్పల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. డీఎంసీ మాట్లాడుతూ వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమల బెడద లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బాగ్అంబర్ పేట డివిజన్‌లోని తిలక్‌నగర్ శ్రీరమణ కేంద్రం పక్కన గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దోమల బెడద లేకుండా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో దోమలు, పారిశుధ్యం సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఫీల్డ్ ఆఫీసర్ రాఘవేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ గుమ్మన్న, మాధవశర్మ, రూప, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ



చిన్నారుల బరువును చూస్తున్న అంగన్‌వాడీ టీచర్ శారద తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారులను బరువు, ఎత్తు కొలతలు తీసుకోవడంతోపాటు వారికి గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, సిబ్బంది హేమలత, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, సాహితీవేత్తలు

వెంకటరెడ్డి మృతి సాంస్కృతిక లోకానికి లోటు

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతికరంగ భీష్ముడిగా గుర్తింపు పొందిన జి.వెంకటరెడ్డి మృతి సాంస్కృతికలోకానికి తీరని లోటని పలువురు సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు, సాహితీవేత్తలు అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన వెంకటరెడ్డి సంతాపసభ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్, పత్రికా రచయిత విజయబాబు, కిన్నెర రఘురామ్, వంశీరామరాజు, దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డా.మధుసూదనరావు, సారస్వత పరిషత్ కార్యదర్శి డా.చెన్నయ్య, లంక లక్ష్మీనారాయణ, ఆరాధన లోకం కృష్ణయ్య, జర్నలిస్ట్ రఫీ, రచయితలు పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, రాఘవరెడ్డి, హమీద్, నాట్యగురువు నిర్మల ప్రభాకర్, గాయకుడుత్రినాథరావు తదితరులు నివాళులర్పించారు.

ట్యాక్స్ నిపుణులకు సత్కారం

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ట్యాక్స్, అకౌంటింగ్ కమ్యూనిటీకి చెందిన తొమ్మిది మంది నిపుణులు అందించిన చిన్న మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు సంబంధించి ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ ట్యాలీ సొల్యూషన్స్ గుర్తించి వారిని సత్కరించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్యాలీ సొల్యూషన్స్ సౌత్‌జోన్ జీఎం అనిల్ భార్గవన్ మాట్లాడుతూ వరంగల్‌లోని ట్యాక్స్ అండ్ అకౌంటింగ్ కమ్యూనిటీ అద్భుతమైన సహకారానికి గుర్తుగా ఈ వేడుక చేసుకుంటున్నామన్నారు. ఈ సహకారం ఎంఎస్ఎంఈలను శక్తిమంతం చేయడానికి కీలకంగా ఉపయోగపడుతుందన్నారు. మందన సోమేశ్వరరావు, ఆంజనేయులు, మురళిమోహన్, కొమ్మరాజు, గోపాలరావు, యాదగిరి, జ్ఞానేందర్‌జోషి, భగవాన్‌దాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కిలిమంజారో అధిరోహకుడికి సన్మానం



దక్షిణాఫ్రికాలో కిలిమంజారోను అధిరోహించిన అలుగడ మనీష్‌యాదవ్‌ను శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఘనంగా సత్కరించారు. సెవెన్ సమిట్స్ మిషన్‌లో భాగంగా మనీష్‌యాదవ్ ఈ పర్వతాన్ని అధిరోహించడం అభినందనీయమని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, మనీష్‌యాదవ్ తండ్రి రామ్మోహన్‌యాదవ్, దశరథ్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు. **- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి**

వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సామాజిక సేవ



మాట్లాడుతున్న బండారు విజయలక్ష్మి

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో మరింత విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక చేపడుతున్నట్లు వైష్ణవ్ బండారు ఫౌండేషన్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని మురికివాడలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులు, ఇతరత్రా పరికరాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు కుట్టు, అల్లికలపై శిక్షణ కల్పించి స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బస్తీలలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత శాఖల అధికారులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి, స్వయం ఉపాధి కార్యక్రమాలపై అర్హులైన వారికి అందేలా ప్రయత్నిస్తామన్నారు. అర్హుల గుర్తింపు కోసం బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సహకారం తీసుకుంటామన్నారు. ఫౌండేషన్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలు బీజేపీ పటిష్టత కోసం కృషి చేస్తామన్నారు.

థియేటర్లలో బాణాసంచా కాలిస్తే కేసులు

ఆవరణలో బోర్డులు ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్లు



ఓ థియేటర్‌లో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ సినిమా థియేటర్ల ఆవరణల్లో బాణాసంచా కాలిస్తే పోలీసు కేసులు పెడతామని మేనేజ్‌మెంట్లు హెచ్చరించాయి. ఈ మేరకు ఆయా థియేటర్‌ల ఆవరణల్లో వాల్‌పోస్టర్లు, బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. గతేడాది డిసెంబర్ 4వ తేదీన రాత్రి ఓ సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన దుస్సంఘటన నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని అన్ని సినిమా థియేటర్ల యాజమాన్యాలు జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా అభిమానులు బాణాసంచా కాలుస్తుండగా ఎన్టీఆర్ భారీ కటౌట్ కాలి బూడిదైన విషయం విదితమే. కొత్త సినిమాలు, ప్రముఖ హీరోలు నటించిన సినిమాలు విడుదల సందర్భంగా ప్రీమియర్ షోల సమయాల్లో తప్పనిసరిగా టికెట్లు ఉన్న ప్రేక్షకులను మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ప్రముఖ హీరో పవన్‌కల్యాణ్ సినిమా హరిహరవీరమల్లు సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో ఎలాంటి అర్భాటాలు లేకుండా బాణాసంచా కాల్చే సంఘటనలు జరగకుండా 80 మంది పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. కాగా గురువారం విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ సినిమా విడుదల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మనుమడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు కల్వకుంట్ల తన స్నేహితులతో సినిమా చూడ్డానికి వచ్చారు. దీంతో ఎలాంటి ఆర్భాటం లేకుండా థియేటర్ మేనేజ్‌మెంట్ చర్యలు తీసుకుంది.

బస్తీదవాఖానా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హర్షం



సీఎం, డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బస్తీ దవాఖానా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు

నల్లకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బస్తీదవాఖానాలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న 1,500 మందిని ఉద్యోగులుగా 2025 - 2026 సర్వీసెస్ కంటిన్యూ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినందుకు, వేతనాలు అమలు చేస్తున్నందుకు తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంగళపాటి సుమన్, ప్రధానకార్యదర్శి అంజద్ అలీఖాన్, కన్వీనర్ మోతుకు ఉప్పలయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నల్లకుంటలోని సంఘం కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీ దవాఖానాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అండగా నిలిచిన ఎమ్మెల్సీ ఎం.కోదండరాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహ, శాంతమ్మ, స్వప్న, అనిత, శ్రీలత, పావని, సురేష్, రాజు, వీరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహిత యాత్రల పేరిట ప్రజాధనం దుర్వినియోగం

రాంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాహిత యాత్రల పేరిట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రజాధనాన్ని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసే ఆర్డినెన్స్ వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘాల బలోపేతానికి కృషి

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి చైర్మన్ సాంబరాజు చక్రపాణి, ప్రధానకార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన వినియోగదారుల ప్రతినిధుల జాతీయ సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో చక్రపాణి, సుదర్శన్ ఈ పదవులకు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం సాయంత్రం గోల్కొండ చౌరస్తాలోని వినియోగదారుల మండలి కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. వివిధ రాష్ట్రాల్లోని సంఘాల పటిష్టతకు, హక్కుల పరిరక్షణ, వినియోగదారుల రక్షణ చట్టాల్లో వినియోగదారుల కమిషన్‌లకు మరింత అధికారాల కోసం పనిచేస్తామని వివరించారు.

7 నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు స్వామివారి పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్ గౌడ్, ఈవో ఎస్.అన్నపూర్ణ తెలిపారు. 9న స్వామివారికి కలశాలతో అభిషేకం జరుగుతుందన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల అనంతరం పవిత్రోత్సవాలు నిర్వహిస్తుంటామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్‌తో మాలలకు అన్యాయం

నల్లకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్ ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ రోస్టర్ 22 కేటాయించి, మాల విద్యార్థులకు పూర్తి అన్యాయం చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును దేశంలోని ఏ రాష్ట్రాలు పట్టించుకోకపోయినా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ఓట్ల కోసం అఘమేఘాల మీద వర్గీకరణ చేసి మాలలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీవోను రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేయొద్దు

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025కు ముందు విడుదల చేసిన నోటిఫికేషన్లలో వర్గీకరణ చట్టం అమలు చేయొద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టం 2025 ఏప్రిల్ 14న రాష్ట్రంలో అమలులోకి వచ్చిందని, అయితే అంతకు ముందే ఎప్‌సెట్, నీట్, పీహెచ్‌డీ తదితర నోటిఫికేషన్లు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఫార్మసీ, అగ్రికల్చర్, పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే మాల, మాల ఉప కులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజలింగం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు దొంగలకు కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నలుగురు దొంగలకు రైల్వే కోర్టు యేడాది కఠిన కారాగార శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. 2024 ఏప్రిల్ 27వ తేదీన సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎంఎంటీఎస్ రైలులో వెళ్తుండగా యాకత్‌పుర వద్ద నలుగురు దొంగలు కత్తులతో బెదిరించి, మెడలో ఉన్న 2 తులాల బంగారు చైన్, రెండు సెల్‌ఫోన్లను లాక్కునిపోయారు. ఈ కేసుకు సంబంధించి... చంచల్‌గూడకు చెందిన మహ్మద్ ఇబ్రహీం(23), రెయిన్‌బజార్‌కు చెందిన మహ్మద్‌తౌహిద్(19), మహ్మద్ అనాసుద్దీన్(19), పిస్తల్‌బండకు చెందిన మహ్మద్ ముఖీద్(19) ఈ నలుగురూ స్నేహితులు. జల్సాలకు అలవాటుపడి రైళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి రైల్వే కోర్టు జడ్జి శ్రీదేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. నలుగురికి యేడాది పాటు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. ఈ నలుగురిని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బర్కత్‌పుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. నింబోలిఅడ్డాకు చెందిన కె.బాలాజీ(35), కె.మారుతి(25) డ్రైవర్లు. రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. శుక్రవారం రాత్రి నిమ్బోలి అడ్డా ప్రధానరహదారిపై ఆటో(టీఎస్07యూబీ9870)లో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్‌సప్లై అధికారులకు అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు